క్లుప్తంగా

పరమ శివుని విగ్రహావిష్కరణ



పరమ శివుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

తాళ్లరేవు: పటవల పంచాయతీ శివారు ఈబీసీ కాలనీలోని రుద్రభూమిలో నూతనంగా నిర్మించిన పరమ శివుని విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఆత్రేయ గోదావరి చెంతన దాతలు, గ్రామస్తుల ఆర్థిక సహకారంతో ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఎంపీపీ రాయుడు సునీత తదితరులు విగ్రహాన్ని సందర్శించి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం జరిగింది.

ఎన్నికల్లో పోటీ చేస్తా : అంగాడి రేవతి



కాట్రేనికోన: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్ కోసం జాతీయ పార్టీకి దరఖాస్తు చేశానని, టిక్కెట్ రాకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని నవ భారత్ గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అంగాడి రేవతి తెలిపారు. కాట్రేనికోన శివారు రాజానగరంలోని ఆమె స్వగృహంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే తపనతో ముమ్మిడివరం నియోజకవర్గంలో నవభారత్ గ్రామీణాభివృద్ధి ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. తన తండ్రి ఆశయంతో ట్రస్టు ఏర్పాటు చేసి, గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించానన్నారు. నియోజకవర్గ ప్రజలు అవకాశం కల్పిస్తే, నిస్వార్థంగా సేవలు అందిస్తానన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

ఐ.పోలవరం: నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం 2024–25 విద్యా సంవత్సరానికి ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం సీట్ల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈఓ 1, 2 ఎస్.కొండారెడ్డి, కె.తిరుమలరావు తెలిపారు. పేద, అనాథ, హెచ్ఐవీ, విభిన్న ప్రతిభావంతుల పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలు వివిధ సిలబస్‌లలో ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థి 2018 ఏప్రిల్ 2 నుంచి 2019 మార్చి 31లోపు జన్మించి ఉండాలన్నారు. ఈ నెల 24వ తేదీలోపు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను వెబ్‌సైట్‌లో, మీ సేవ, సచివాలయం, నెట్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కౌంటింగ్ సెంటర్ల పరిశీలన



ఎస్ఆర్‌కే కళాశాల గదులను పరిశీలిస్తున్న మునిస్వామి

యానాం: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని కౌంటింగ్ సెంటర్లను బుధవారం ఆర్ఏఓ మునిస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గదులను సందర్శించారు. ఎన్నికల అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు



జనుపల్లి గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అమలాపురం రూరల్: రానున్న ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అమలాపురం రూరల్ పోలీసులు బుధవారం పోలీసు కవాతు నిర్వహించారు. రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు కవాతు చేశాయి. జనపల్లి గ్రామంలో ప్రారంభించి, నల్లమిల్లి, ఎ.వేమవరం, ఎ.వేమరప్పాడు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. సీఐ వీరబాబు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాలు అందుబాటులో ఉంటాయని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు వివాదాలకు ఆస్కారం లేకుండా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలని సీఐ వీరబాబు, తాలూకా ఎస్సై శేఖర్‌బాబు కోరారు.

12న ద్విచక్ర వాహనాలకు వేలం

అమలాపురం టౌన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అమలాపురం కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు ఈ నెల 12న ఉదయం 9 గంటలకు స్థానిక నల్లవంతెన వద్ద ఉన్న ఎస్ఈబీ స్టేషన్ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నట్టు సీఐ సాయిస్వరూప్ ఓ ప్రకటనలో తెలిపారు. అమలాపురం ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేలంలో పాల్గొనే వ్యక్తి రూ.2 వేల ధరావత్తు చెల్లించాలని చెప్పారు. వేలం పాట పాడినవారు మొత్తం సొమ్మును అదనంగా జీఎస్టీతో కలిపి, ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలని తెలిపారు.

దవాఖానాకు సొంత గూడు

- పట్టణ రెండో అర్బన్ హెల్త్ సెంటర్‌కు నూతన భవనం
- రూ.1.5 కోట్లతో నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న మంత్రి విశ్వరూప్



అమలాపురంలో మంత్రి విశ్వరూప్ ప్రారంభించనున్న రెండో అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవనం

అమలాపురం టౌన్: ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన ప్రభుత్వం.. వైద్యారోగ్య మౌలిక సదుపాయాల కల్పనలోనూ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అధునాతన వైద్య సదుపాయాలతో ఆస్పత్రులు, పీహెచ్‌సీలను నిర్మించడమే కాకుండా, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లకు సొంత భవనాలను సైతం సమకూరుస్తోంది.

పట్టణ ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా రెండేళ్ల కిందటే రెండో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (అర్బన్ హెల్త్ సెంటరు) ఏర్పాటైంది. ఈ రెండో అర్బన్ హెల్త్ సెంటరు స్థానిక కుళాయి చెరువు వద్దనున్న కచేరి చావిడి భవనంలో కొనసాగుతోంది. ఈ సెంటరుకు సొంత భవనం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో రూ.1.05 కోట్లతో నూతన భవనం సమకూర్చారు. ఇన్నాళ్లూ నిర్మాణ దిశలో ఉన్న ఆ భవనం అన్ని సౌకర్యాల కల్పనతో ప్రారంభానికి సిద్ధమైంది. స్థానిక 27వ వార్డులో ఈడబ్ల్యూఎస్ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటరు భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం ఉదయం ప్రారంభించనున్నారు.

అప్పటికే అమలాపురం భూపయ్య అగ్రహారం 18వ వార్డులో అర్బన్ హెల్త్ సెంటర్ కొన్ని దశాబ్దాలుగా ఉంది. దీనికితోడు రెండో సెంటరు కూడా సేవలు అందుబాటులోకి వచ్చాయి. మున్సిపాలిటీ 30 వార్డులతో దాదాపు 54 వేల మంది జనాభా కలిగి ఉంది. చెరో సగం వార్డు ప్రజలు ఈ రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల ఆరోగ్య అవసరాలకు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఒక్కో సెంటరులో ఓ మెడికల్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ముగ్గురు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. పట్టణ ప్రజలకు ఈ రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నుంచే కాకుండా, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ద్వారా కూడా వైద్య సేవలు అందుతున్నాయి. మున్సిపల్ డీఈఈ నాగ సతీష్ ఆధ్వర్యంలో ఇంజినీర్ల బృందం ఈ హెల్త్ సెంటరు భవనాన్ని నిర్మించారు. గురువారం జరిగే ఈ ఆరోగ్య భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్ పర్యవేక్షించారు.

నేడు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

రెండో అర్బన్ హెల్త్ సెంటరును మంత్రి విశ్వరూప్ ప్రారంభించాక స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో అందరికీ ఇళ్లు పథకానికి సంబంధించి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తారని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. అలాగే సాయంత్రం మూడు గంటలకు ఇదే మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంత్రి విశ్వరూప్ వైఎస్సార్ చేయూత పథకం కింద లబ్ధిదారులకు లబ్ధి అందించనున్నారు. పట్టణంలో అర్హులైన 1,400 మహిళలకు ఒక్కొక్కరికి రూ.18,750 వంతున ఇవ్వనున్నారని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు పట్టణ పార్టీ శ్రేణులు, కౌన్సిలర్లు, గృహ సారథులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

మాకు బాగా దగ్గరైంది



బడుగు, బలహీన వర్గాల వారు జీవించే ఈడబ్ల్యూఎస్ కాలనీలో రెండో అర్బన్ హెల్త్ సెంటరు ఏర్పాటు చేయడం వల్ల మా కాలనీకి బాగా దగ్గరైంది. ప్రభుత్వ వైద్య సేవల కోసం పట్టణంలో దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మొదటి అర్బన్ సెంటర్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా కాలనీలో రావడంతో మాకు చాలా ఆనందంగా ఉంది. జగన్ ప్రభుత్వంలో పథకాల లబ్ధే కాదు.. ఆరోగ్య సమస్యలొస్తే వెంటనే వెళ్లి చూపించుకునేలా హెల్త్ సెంటరు దగ్గరలోకే వచ్చింది.

– బందారు రవికుమార్, 27వ వార్డు, అమలాపురం

ప్రజలకెంతో ప్రయోజనకరం



పట్టణ ప్రజలకు అవసరాలకు అనుగుణంగా వైద్య సేవలను పెంచడం ఎంతో ప్రయోజనకరం. ఇప్పటికే అమలాపురంలో వంద పడకలతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఉంది. మరోవైపు పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. మధ్యలో మున్సిపాలిటీ ద్వారా మాతా, శిశు ఆరోగ్య కేంద్రం కూడా వైద్య సేవలు అందిస్తోంది. ఇన్ని రూపాల్లో ప్రజలకు ముఖ్యంగా పేద ప్రజలకు జగన్ ప్రభుత్వంలో వైద్యం ఉచితంగా పూర్తిగా అందుబాటులోకి వచ్చింది.

– రేకాడి గంగాభవాని, 26వ వార్డు, అమలాపురం

ఆలయానికి భూమిపూజ



నూతన ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ

- పాల్గొన్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ

అల్లవరం: త్రేతాయుగంగా పురాణ పురుషుడు శ్రీరాముడు స్వయంగా ప్రతిష్ఠించిన పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయాన్ని పునర్నిర్మాణం చేసుకోవడం మహాభాగ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో సామంతకుర్రు శివారు ఎస్.రామేశ్వరంలో పార్వతీ సమేత రామేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ హాజరయ్యారు. నూతన ఆలయం వద్ద ఏర్పాటుచేసిన హోమానికి మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ ప్రత్యేక పూజలు చేసి, ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. బాలాలయంలో ఏర్పాటుచేసిన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కొమరగిరిపట్నం శివారు సీతారామపురంలో జేజేఎం నిధులు రూ.30 లక్షలతో నిర్మించనున్న ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, కొల్లు వెంకటరమణ, బర్రే సీతారత్నం, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కర్రి సత్య, పులుసుగంటి రాజేశ్వరి, సొసైటీ చైర్మన్ గుర్రం బాబులు, పార్టీ నాయకులు గుంటూరి బాలరాజు, కర్రి శ్రీను, బొంతు సత్యనారాయణ, పులుసుగంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాలవెల్లువను సద్వినియోగం చేసుకోండి



కేంద్రంలో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. పశు వైద్యాధికారి నారాయణరావు అధ్యక్షతన తూర్పులంకలో జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తూర్పులంక, గోడి, గోడిలంక, అల్లవరం, దేవగుప్తం, ఎంట్రుకోన, తాడికోన, గూడాల, బోడసకుర్రు గ్రామాల్లోని జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో అమూల్ సంస్థ ఏర్పాటు చేసిన పరికరాలను ఇన్‌స్టాలేషన్ నిర్వహించారు. ప్రతి కేంద్రానికి కంప్యూటర్, ప్రింటర్, మిల్క్ ఎనలైజర్, స్టిరర్, కాటా పరికరాలను ఇచ్చినట్టు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడలి గంగాచలం, ఈఓపీఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, డీసీఓ శివన్నారాయణ, ఏఎంపీం సయ్యద్, కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా రక్షిత మంచి నీరు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- అభివృద్ధి పనుల ప్రారంభం



వడ్డిపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: ప్రతి ఇంటికీ కుళాయిలు వేసి, రక్షిత మంచి నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని టీటీడీ పాలకవర్గ సభ్యుడు, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకూ ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీరు అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పల్లెలకూ వైద్యం అందించాలనే తపనతో మండలంలో జల్‌జీవన మిషన్ నిధులతో విలేజ్ క్లినిక్ సెంటర్లు ప్రారంభించామన్నారు. పల్లంకుర్రు శివారు వడ్డిపేట, చింతల చెరువు, చింతల గరువు, కొత్తపాలెం, మొల్లేటి మొగ, కందికుప్ప శివారు జయపురం, కప్పలవారిపేట, జాంబవుని పేట, తొలకలవారిపేట, కందికుప్ప, దొంతికుర్రు శివారు కొప్పిగుంట సీతమ్మ చెరువు, అడవిపేట, గెద్దనపల్లి శివారు బక్కివారిపేట, పోరపేట, చింతల మెరక, కొప్పిగుంట శివారు రావుల చెరువు, చెయ్యేరు శివారు అగ్రహారంల్లో ఇంటింటికీ మంచినీటి కుళాయి పనులకు ఎమ్మెల్యే పొన్నాడ శంకుస్థాపన చేశారు. మొల్లేటి మొగ, కొత్తపాలెం, చింతలచెరువు, వడ్డిపేట, కందికుప్ప మెయిన్, దొంతికుర్రు, బక్కివారిపేట, కొప్పిగుంట, ఓఎన్‌జీసీ నిధులతో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.20.80 లక్షల చొప్పున కొత్తపాలెం, మొల్లేటిమొగల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సెంటర్లను, కందికుప్ప శివారు బొజ్జావారిపేటలో రూ.43.60 లక్షలతో సచివాలయం-2 నూతన భవనాన్ని, రూ.25 లక్షలతో పల్లంలో సచివాలయం-1ను, రూ.23.94 లక్షల చొప్పున చెయ్యేరు ఆర్బీకే-1, చెయ్యేరు ఆర్బీకే-2 నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. చెయ్యేరు అగ్రహారంలో ఉపాధి, సీఎస్ఆర్ నిధులు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు నాతి అలివేణు, చల్లగల్ల వెంకట లక్ష్మి, గంటి వెంకటసుధాకర్, మల్లాడి ఏడుకొండలు, జెడ్పీటీసీ నేల కిషోర్, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ, ఏడిది సుబ్బు, నల్లా బేబీజానకి, మల్లాడి ఆదినారాయణ, ఇసుకపట్ల శ్రీనుబాబు, మల్లాడి వీరబాబ్జి, మోకా చంద్రనాగరత్నం, జగడం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్, ఎమ్మెల్యే పొన్నాడ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు, నాయకులు

తాళ్లరేవు: వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి తమకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు, తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వలంటీర్లు క్షీరాభిషేకం నిర్వహించారు. జార్జిపేట గోపాల్ నగర్‌లో వలంటీర్లు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారి చిత్రపటాలకు సచివాలయం-1 వలంటీర్లు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ రెడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మందపల్లి నాగమ్మ, పార్టీ సీనియర్ నాయకుడు దడాల జగదీశ్వరరావు, నెల్లి కిరణ్‌కుమార్‌ను దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సువర్ణ పరిపాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో మరోమారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పుదుచ్చేరి వరకూ సర్కార్ పొడిగింపు

యానాం: యానాం నియోజకవర్గ ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు కాకినాడ నుంచి చెన్నై వెళ్లే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకూ పొడిగించేందుకు రైల్వే శాఖ అంగీకరించిందని పుదుచ్చేరి ఎంపీ వైథిలింగం తెలిపారు. ఏప్రిల్ మూడు నుంచి ఇది అమల్లోకి వస్తుందని బుధవారం ఆయన విలేకరులకు చెప్పారు. కాకినాడ నుంచి చెంగల్‌పట్టు వరకు నడుస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించాలని పార్లమెంట్‌లో గట్టిగా పోరాడగా, ఈ మేరకు రైల్వే శాఖ అంగీకరించిందన్నారు. కాకినాడ నుంచి మధ్యాహ్నం 2.30కు బయలుదేరే సర్కార్ మరునాడు ఉదయం 9.30కు పుదుచ్చేరి చేరుకుంటుందని, అదేరోజు మధ్యాహ్నం 1.30కు బయలుదేరుతుందన్నారు. బుధవారం మినహా మిగతా రోజులన్నీ సర్కార్ ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరికి వస్తుందన్నారు.

రహదారి పనులకు భూమిపూజ



రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో తాను హామీ ఇచ్చిన పనులు నెరవేర్చేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఎప్పట్నుంచో నిర్లక్ష్యానికి గురైన డ్రైన్లు, రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. బుధవారం స్థానిక కనకాలపేట గ్రామంలోని ఆదిఆంధ్రాపేట రహదారి నిర్మాణానికి రూ.20.30 లక్షలతో చేపట్టే పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే లాడ్ నిధులతో మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు వివరించారు. నియోజకవర్గంలో కొత్తగా వెలిసిన పలు కాలనీల్లో డ్రైన్లు, సీసీ రహదార్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఈఈ చంద్రశేఖరన్, ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ గంగాభవాని తదితరులు

ముమ్మిడివరం: ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కోలా గంగా భవాని అధ్యక్షతన కార్యక్రమం కొనసాగింది. బాలికల చదువు ప్రాముఖ్యాన్ని, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాలు, యాసిడ్ దాడులు వంటి సాంఘిక దురాచారాల నిర్మూలనపై చర్చించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వి.విమల, విస్తరణాధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులతో రోడ్ల అభివృద్ధి



పెద్దబొడ్డు వెంకటాయపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ సునీత

తాళ్లరేవు: మండల ప్రజా పరిషత్ నిధులతో గ్రామీణ ప్రాంత రహదారులు అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. బుధవారం కోరంగి పంచాయతీలోని పెదబొడ్డు వెంకటాయపాలెంలో రూ.4 లక్షలు, పి.మల్లవరం పంచాయతీ ప్రత్తిగొందిలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారులకు ఎంపీపీ సునీత శంకుస్థాపన చేశారు. అమె మాట్లాడుతూ పలు పంచాయతీల్లో దీర్ఘకాలంగా అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ఎంపీటీసీ పాలెపు పోశియ్య, దున్నా రాంబాబు, ఉప సర్పంచ్‌లు పంపన రామకృష్ణ, కామాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శులు సూరంపూడి వెంకటరమణ, అర్ధాని రామరాజు, నాయకులు రాయుడు గంగాధర్, కూరాటి వాసు, హేమసుందర్, తులసి, వలంటీర్లు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

తాళ్లరేవు: కోరంగిలోని కోరింగా ఫార్మసీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫార్మసీ ఎడ్యుకేషన్ డే సందర్భంగా మహాదేవ్‌లాల్ స్కోరూఫ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఇన్ఫుక్యురీస్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ వీటిని నిర్వహించింది. సుమారు 100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు త్వరలో నియామక పత్రాలు అందజేయనున్నట్లు కంపెనీ ప్రతినిధి దీపక్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దున్నా జనార్దనరావు, సెక్రటరీ ప్రగళ్లపాటి కనకరాజు, డైరెక్టర్ చిట్టూరి కలికి మూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలి



ఉప్పలగుప్తంలో ఓహెచ్ఎస్ఆర్‌ను పరిశీలిస్తున్న షంషి, ప్రసాద్



ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలిస్తున్న భీమేశ్వర్ తదితరులు

ఉప్పలగుప్తం: వేసవి రీత్యా ప్రజలకు అందించే తాగునీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్‌కు మండల ప్రత్యేకాధికారి, అమలాపురం ఏడీఏ ఎంఏ షంషి సూచించారు. తాగునీటిపై ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మండలంలోని ఎస్.యానం, ఉప్పలగుప్తం, సన్నవిల్లి గ్రామాల్లో బుధవారం షంషి ఎంపీడీఓతో కలసి కొన్ని ఓహెచ్ఎస్ఆర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఉన్న 46 ఓహెచ్ఎస్ఆర్‌ల ద్వారా 3.94 లక్షల కిలోలీటర్ల తాగునీరు ప్రజలకు సరఫరా అవుతోందన్నారు. ప్రతి ఓహెచ్ఎస్ఆర్‌లను శుభ్రపరిచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా అధికారులను ఆదేశించి, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతిచోటా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ ఉన్నారు.

మంచినీటి ట్యాంకుల క్లీనింగ్

ముమ్మిడివరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని రక్షిత మంచినీటి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గ పర్యవేక్షణాధికారి, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి కె.భీమేశ్వర్, మండల ప్రత్యేకాధికారి కె.రవికుమార్, ఎంపీడీఓ కేవీ నరసింహారావు పర్యవేక్షణలో మండలంలోని 16 వాటర్ ట్యాంకులను పరిశీలించి, శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.శ్రీనునాయక్, విస్తరణాధికారి సీహెచ్ఎల్ కల్యాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నానాజీ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని రక్షిత మంచినీటి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గ పర్యవేక్షణాధికారి, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి కె.భీమేశ్వర్, మండల ప్రత్యేకాధికారి ఎం.సాంబశివయ్య, ఎంపీడీఓ ఎండీ అమీలు పర్యవేక్షణలో 47 ట్యాంకులను శుభ్రం చేయించారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు మురమళ్ల, పశువుల్లంక గ్రామాల్లో కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అల్లవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న 58 ఓహెచ్ఆర్ ట్యాంక్‌లను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయించినట్టు ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. పంచాయతీరాజ్ ఎస్ఈ చంటిబాబు, మండల ప్రత్యేకాధికారి కె మూర్తి పర్యవేక్షించారని తెలిపారు.

అమలాపురం రూరల్: అమలాపురం మండలంలోని 45 ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయించినట్టు ఎంపీడీఓ జొన్నాడ వెంకటేశ్వరరావు తెలిపారు. డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు, ప్రత్యేకాధికారి ఎం.జ్యోతి లక్ష్మీదేవి, ఈఓపీఆర్డీ జి.మల్లికార్జునరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏఈ చినబాబు బండారులంకలో పనులను పర్యవేక్షించారు.